# Visit of Minister of State for External Affairs Shri V.Muraleedharan to South Sudan (October 20-22, 2021)

October 25, 2021

# విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి శ్రీ వి. మురళీధరన్ దక్షిణ సూడాన్ పర్యటన (అక్టోబర్ 20-22, 2021)

అక్టోబర్ 25, 2021

1. విదేశీ వ్యవహారాలు మరియు పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి [ఎంఓఎస్(వీఎం)] శ్రీ వి. మురళీధరన్, 2021 అక్టోబర్ 20-22 తేదీల్లో జుబా (దక్షిణ సూడాన్)లో అధికారిక పర్యటన జరిపారు. గడిచిన ఐదేళ్లకు పైగా కాలంలో ఒక భారతీయ మంత్రి దక్షిణ సూడాన్‌కు జరిపిన మొదటి పర్యటన ఇది.

2. ఎంఓఎస్(వీఎం) దక్షిణ సూడాన్ విదేశీ వ్యవహారాలు మరియు అంతర్జాతీయ సహకార శాఖ మంత్రి గౌరవనీయ శ్రీ మాయిక్ అయితో సమావేశమయ్యారు. ప్రస్తుతం నెలకొన్న సంబంధాలన్నింటినీ ఇరు పక్షాలు సమీక్షించాయి అలాగే వ్యవసాయం, పశుపోషణ, విద్య, ఆరోగ్య సంరక్షణ మరియు ఐటీతో సహా వివిధ రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించుకోవడానికి ఆసక్తిని వ్యక్తం చేశాయి.

3. విపత్తు నిరోధక మౌలిక సదుపాయాలకు సంబంధించిన కూటమి (సీడీఆర్ఐ)లో చేరాల్సిందిగా దక్షిణ సూడాన్‌ను ఆహ్వానించారు. దక్షిణ సూడాన్ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి మేరీ నవాయ్ మార్టన్‌తో భేటీ సందర్భంగా, పార్లమెంటరీ విధానాలు మరియు ప్రక్రియల రూపకల్పనలో భారత్ యొక్క అనుభవాలను దక్షిణ సూడాన్‌తో పంచుకోవడానికి అలాగే వివిధ సామర్థ్య నిర్మాణ శిక్షణ కోర్సులను అందించడానికి భారత్ తన సంసిద్ధతను తెలియజేసింది.

4. దక్షిణ సూడాన్ మొట్టమొదటి ఉపాధ్యక్షుడు గౌరవనీయ శ్రీ రీక్ మాచర్ టెనీ ధుర్గాన్‌తో భేటీ కూడా ఈ పర్యటనలో చోటుచేసుకుంది. ద్వైపాక్షిక వాణిజ్యం విషయంలో అలాగే ఇరు దేశాల మధ్య భారతీయ పెట్టుబడులకు సంబంధించి అపారమైన అవకాశాలు ఉన్నాయని ఎంఓఎస్(వీఎం) ఉద్ఘాటించారు. దక్షిణ సూడాన్‌లో భారతీయ ఎంట్రప్రెన్యూర్స్ ఎదుర్కొంటున్న అడ్డంకులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దక్షిణ సూడాన్‌లో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని నెలకొల్పడం గురించి గౌరవనీయ రీక్ మాచర్ భరోసానిచ్చారు.

5. దక్షిణ సూడాన్ అధ్యక్షుడు గౌరవనీయ శ్రీ సాల్వా  కీర్ మాయర్డిట్‌తో భేటీ సందర్భంగా, దక్షిణ సూడాన్‌లో వివాదానికి సంబంధించి పరిష్కారంపై పునరుత్తేజిత ఒప్పందం (ఆర్-ఏఆర్‌సీఎస్ఎస్)లో పేర్కొన్న విధంగా ప్రస్తుతం కొనసాగుతున్న శాంతి ప్రక్రియకు భారత్ మద్దతును పునరుద్ఘాటించారు. ఆరోగ్య సంరక్షణ రంగంలో భారత్ సహకారాన్ని అధ్యక్షుడు సాల్వా కీర్ కోరారు. అదేవిధంగా దక్షిణ సూడాన్‌లో నివశిస్తున్న భారతీయ పౌరుల చిరకాల డిమాండ్ అయినటువంటి జుబాలో హిందూ శ్మసానవాటిక ఏర్పాటు ఇంకా దేవాలయం నిర్మాణానికి తన ఆమోదాన్ని కూడా ఆయన ప్రకటించారు.

6. ఈ పర్యటనలో భారతీయ పౌరులతో సంభాషణ అలాగే భారతీయ ఎంట్రప్రెన్యూర్స్‌తో సంప్రదింపులు కూడా చోటుచేసుకున్నాయి. ఐక్యరాజ్యసమితి (యూఎన్) మిషన్ కింద నెలకొల్పిన భారతీయ ఆర్మీ ఫీల్డ్ హాస్పిటల్‌ను, బీఏపీఎస్ హిందూ దేవాలయాన్ని అలాగే డాటర్స్ ఆఫ్ మేరీ ఇమాక్యులేట్ (భారతీయ మత సమాజం) ఆవరణను ఎంఓఎస్(వీఎం) సందర్శించారు. దక్షిణ సూడాన్‌లోని భారతీయ పౌరులు ఎంఓఎస్(వీఎం)కు హృదయపూర్వక ఆహ్వానం పలికారు అలాగే అనేక ఏళ్ల తర్వాత ఒక భారతీయ మంత్రికి సాదర స్వాగతం పలకడం పట్ల అత్యంత సంతోషాన్ని వ్యక్తం చేశారు.

7. ఎంఓఎస్(వీఎం) దక్షిణ సూడాన్ పర్యటన అనేది ద్వైపాక్షిక సంబంధాలకు ఉత్తేజాన్ని అందించడంలో ఒక మైలురాయి వంటి పరిణామంగా నిలిచింది.

**న్యూఢిల్లీ**
**అక్టోబర్ 25, 2021**

DISCLAIMER: This is an approximate translation. The original is available in English on MEA's website and may be referred to as the official press release.